www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 19 డిసెంబర్ 2023
5
వైఎస్ఆర్

రేపటి నుంచి 'యువభేరి'

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పి.పద్మ కల్చరల్ కో-ఆర్డినేటర్ ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో ఈనెల 20,21న విశ్వవిద్యాలయంలో యువభేరీ పేరుతో యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సంగీతం, నృత్యం, నాటకం, లలిత కళలు, సాహిత్యాంశాలపై విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్, కామర్స్ బిల్డింగ్‌లోని సురభి ఆడిటోరియల్ పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పోటీల్లో యోగి వేమన విశ్వవిద్యాలయం కళాశాల, విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలకు చెందిన ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మాత్రమే 2024, జనవరి 5 నుంచి 9వ వరకు వైజాగ్ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించే దక్షిణ భారతదేశ విశ్వవిద్యాలయాల యువజనోత్సవ పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు 9550864584లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే

సమ్మెను ఉధృతం చేస్తాం

7వ రోజు ప్రదర్శనలు, మానవహారాలతో నిరసించిన అంగన్వాడీలు - సమ్మెకు టిడిపి, కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకుల మద్దతు

ప్రజాశక్తి-కడప అర్బన్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం రాజీవ్‌పార్కు రోడ్డులో మానవహారం నిర్వహించారు. మానవహారానికి సిఐటియు జిల్లా, నగర ప్రధాన కార్యదర్శులు మనోహర్, వెంకట సుబ్బయ్య, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు అంగన్వాడీ సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. గొంతెమ్మ కోరికలు కోరడం లేదని ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని కోరుతున్నామని చెప్పారు. మొండి వైఖరి వీడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను తీర్చాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె సోమవారం 7వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా నిలిచారు. **మైదుకూరు :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్ అన్నారు. అంగన్వాడీ నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం మైదుకూరు ఎంపిడిఒ కార్యాలయం నుండి రాయల సర్కిల్ వరకు ర్యాలీగా వచ్చి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుధాకర్, షరీఫ్, గురయ్య, రవి, రాజా, జహంగీర్ భాష, సమ్మెలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు గంగావతి, చెన్నమ్మ ధనలక్ష్మి పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** అంగన్వాడీల డిమాండ్లను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. పోరుమామిళ్లలో అంబేద్కర్ విగ్రహం ఎదుట మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి మేరీ, దస్తగిరమ్మ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఓబులాపురం విజయమ్మ, రేణుక, జ్యోతిర్మ, రమాదేవి, శ్రీదేవి, లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్మికులు, ఆయాలు, మిని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **దువ్వూరు :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె అంగన్వాడీ కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో సమ్మె నిర్వహించారు. వారి ఆందోళనకు మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోర్ రెడ్డి రమణారెడ్డి, కారపు రెడ్డి సంజీవరెడ్డి, తాహిర్ హుస్సేన్, మండల నాయకులు పాల్గొన్నారు. **వేంపల్లె :** అంగన్వాడీ మహిళలను వైసిపి ప్రభుత్వం రోడ్లపైకి లాగడం శోచనీయమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ అన్నారు. 7 రోజుల నుండి అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలు వినూత్నంగా చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలియజేశారు. అనంతరం అంగన్వాడీలకు టిడిపి ఆధ్వర్యంలో బిస్కెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లాబకష్, ఆర్.వి రమేష్, మహబూబ్ షరీఫ్, ఇలియాస్, వెంకటయ్య, జిలాన్, తిప్పారెడ్డి, లాడెన్ బాష, రమణ, సిఐటియు నాయకులు లలితా దేవి, సావిత్రి, ఎఐటియుసి నాయకులు సరస్వతి, శైలజాతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **బద్వేలు :** అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సమగ్ర శిశు అభివృద్ధి అధికారిని (సిడిపిఒ) కార్యాలయం నుంచి సిద్ధవటం రోడ్డు ఎన్‌జిఒ కాలనీ, వైఎస్ఆర్ సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పడి తమ నిరసన తెలియజేశారు. అంగన్వాడీల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే మద్దతు ప్రకటించి మాట్లాడారు. అంగన్వాడీలతోపాటు సామాన్య జనాన్ని కూడా ముఖ్యమంత్రి మోసం చేశారని, అంగన్వాడీలను నిరంతరమూ వేధిస్తున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వానికి గట్టి సమాధానం చెప్పాలని సూచించారు. తాము ఆడవాళ్ళం కాదు మహాశక్తులమని గుర్తించేలా చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కెవి సుబ్బారెడ్డి, ఎస్. మహేశ్వర్ రెడ్డి, తెలుగు యువత జిల్లా నాయకులు ఎస్. జహంగీర్‌బాష, సిపిఐ పట్టణ కార్యదర్శి పి. బాల బాలయ్య, ఎఐటియుసి ఏరియా కార్యదర్శి పి. వెంకటరమణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, రసూల్‌లు వ్యవసాయ కార్మిక సంఘం గోపాల మండల నాయకులు కదిరయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ఎం షఫీ, జి. నాగార్జున అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు గౌరవ ధ్యక్షురాలు కె. సుభాషిని, ప్రధాన కార్యదర్శి ఆర్. హుసేనమ్మ, నాయకురాళ్లు సత్యవతి, కళావతి ,విజయమ్మ, తులసమ్మ, వెంకట నరసమ్మ, వసంతమ్మ, శ్రీలత, లీలావతి, కళావతి ,కృష్ణవేణి, ప్రవీణ, ఉమా దేవి, మహాలక్ష్మి, రాధమ్మ, అరుణమ్మ పెద్ద సంఖ్యలో అంగన్వాడీ కార్మికులు, ఆయాలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న అంగన్వాడీల నిరసన కొనసాగుతోంది. అంగన్వాడీ కార్యకర్తలకు మద్దతుగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. మంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** అంగన్వాడీలు, సహాయకులు పోరును రోజురోజుకూ ఉధృతం చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగల గొట్టించినా ఉద్యమాన్ని ఆపడం లేదు. తమ డిమాండ్ల సాధన కోసం రోజుకొక కొత్త రూపం లో సమ్మెను ముందుకు తీసుకుపోతున్నారు. సోమ వారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగ న్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని మున్సి పల్ చైర్మన్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

పోరుమామిళ్లలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

వేంపల్లెలో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

పులివెందులలో మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్వాడీలు

విద్యాvyavastha నిర్వీర్యం

- విశ్వవిద్యాలయాలు రాజకీయ కేంద్రాలుగా మార్చారు
- ఎస్ఎఫ్ఐ 27వ జిల్లా మహాసభల్లో మాజీ కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

కొంతమందికే చదువు అనే మనుధర్మ సిద్ధాంతాన్ని బిజెపి అమలు చేస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని ఆర్‌సిఎం పాఠశాల మైదానంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 27వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి రోజు విద్యార్థులతో బహిరంగ సభను జిల్లా అధ్యక్షులు జి.సునీల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులు రాహుల్, ఎంఆర్ నాయక్, వినయ్, సహాయ కార్యదర్శులు వి.రవి, ఎస్.కరిష్మా, జిల్లా కమిటీ సభ్యులు వై.అజయ్ కుమార్, ఎస్.మనోజ్, పోరుమామిళ్ల మండల మాజీ కార్యదర్శి ఎస్.భైరవ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కొంతమందికే చదువు అనే మనుధర్మ సిద్ధాంతాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలల సీట్ల భర్తీలో రిజర్వేషన్లు పాటించడం లేదని ప్రశ్నించారు. విద్యా విధానం కేంద్ర రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉంటే దాన్ని మోడీ పూర్తిగా తొలగించి, కేంద్ర జాబితాలోనే పెట్టుకొని ఆశాస్త్రీయమైన కాషాయ విద్య బీజాలు విద్యార్థుల్లోకి చొప్పిస్తున్నారని పేర్కొన్నారు. ఇది దేశ లౌకిక వ్యవస్థకు, ఫెడరల్ వ్యవస్థకు తీవ్ర విఘాతమన్నారు. మేధావుల కేంద్రాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు, రాజకీయ కేంద్రాలుగా మార్చిన ఘనత బిజెపి ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవ చేశారు. కేరళ వామపక్ష ప్రభుత్వం నూటికి 94 శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా దేశం ముందు రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన 'కొఠారి కమిషన్' కేంద్ర బడ్జెట్లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని రికమండేషన్ చేసిందని, రిపోర్టు వచ్చి 30 ఏళ్లు గడుస్తున్నా 10 శాతం నిధులు కన్నా అదనంగా ఇచ్చింది లేదని పేర్కొన్నారు. కేంద్రంలో పాలన దీర్ఘకాలం సాగించిన ప్రభుత్వాలదే ఈ నేరమన్నారు. ఏడాదికి 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తానని నరేంద్రమోడీ 2014 ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, 9 సంవత్సరాలు గడిచినా ఉన్న ఉద్యోగాలు పోయాయి కానీ, ఒక్క కొత్త ఉద్యోగం రాలేదని చెప్పారు. జగన్ 2019 ఎన్నికల ముందు రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని ఎన్నికల హామీ ఇచ్చారని మాట తప్పారన్నారు. బిజెపి, వైసిపి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు, నిరుద్యోగులకు, ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చకుండా మాట తప్పాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 51- ఏ (హెచ్) లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ శాస్త్రీయ విద్యా దేశ భావిభారత పౌరులకు అందించాలని స్పష్టంగా లిఖిత పూర్వ రాజ్యాంగంలో చేర్చారని, దానికి భిన్నంగా జ్యోతిష్యం, హస్త సాముద్రికం, చిలక దోషం, రేఖా శాస్త్రాలు, వాస్తు శాస్త్రాలు, వేద గణితాలు లాంటి మూఢనమ్మకాల విద్యను ప్రవేశపెట్టి బోధించే పాలకులు నేడు కేంద్రంలో వచ్చి కూర్చొని పరిపాలన సాగిస్తున్నారని వారు విద్యార్థులకు గుర్తు చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థుల్లో నిజాయితీ, నిబద్ధత, సామర్థ్యం, పెంపొందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. బిజెపి పాలనలో దేశంలోని యూనివర్సిటీలను అగ్రకులాల అగ్రహారాలుగా మార్చి వేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని దించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. 90 శాతం కళాశాలలో నాణ్యతలేని విద్యకు, నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కేంద్రాలుగా మారాయి అన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాలలో 11 వేల అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, నాన్ టీచింగ్ స్టాఫ్ ను నియమించకుండా యూనివర్సిటీలను సంక్షోభంలోకి ఉద్దేశపూర్వకంగానే నెట్టుతున్నాయన్నారు. కార్పొరేట్ విద్యను, విదేశీ యూనివర్సిటీలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. విద్య వ్యాపారంగా దోపిడీకి కేంద్రాలుగా మార్చిన ఘనత నేటి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. విద్యార్థి ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతున్నారని, సైన్సు, హెల్త్ రంగాల్లో ఇస్తున్న 92 అవార్డులు రద్దు చేశారని విమర్శించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ 27వ జిల్లా మహాసభలకు ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాంద్ బాషా, వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశు సంఘీభావం మద్దతు తెలియజేశారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి చంద్రశేఖర్

మహా సభలకు హాజరైన విద్యార్థులు

పేదల పాలిట సంజీవని 'ఆరోగ్యశ్రీ' : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రధాన్యతో అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం సేవలు పేదల పాలిట సంజీవనిగా ఉపయోగపడుతున్నాయని కలెక్టర్ వి.విజయ్ రామరాజు ప్రశంసించారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా ఆరోగ్యశ్రీ మెగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డి, మైదుకూరు, బద్వేలు ఎమ్మెల్యేలు ఎస్. రఘురామిరెడ్డి, డాక్టర్ డి.సుధా, రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ కమిషన్ మెంబర్ హిదాయతుల్లా, మైనరిటీస్ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ బాగ్దాదీ, జెసి గణేష్ కుమార్, ఎఎస్‌పి తుషార్ డూడీ, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరయ్యారు. విసి అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ ద్వారా సామాన్య ప్రజల జీవితాలకు మరింత భరోసా కల్పించిందన్నారు. అనారోగ్యం బారిన పడ్డవారికి, వారి వైద్యానికి అయ్యే ఖర్చును భరించడమే కాకుండా, వారు పూర్తిగా కోలుకొనే వరకూ ఆరోగ్య ఆసరా నిస్తూ, దేశంలోని ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆరోగ్య ఖర్చు రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తున్న ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు ఉన్న వ్యయ పరిమితిని ఇక నుండి రూ.25 లక్షల వరకు పెంచిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లాలో 7.76 లక్షల మంది ఆరోగ్యశ్రీ కార్డుదారులకు మేలు చేకూరనుందన్నారు. ఈ నాలుగున్నర ఏళ్లలో జిల్లాలో 2,64,346 చికిత్సలు/తెరపీలకు గాను ఇప్పటి వరకు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృత స్థాయిలో ప్రచారం చేసేందుకు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు.. గ్రామస్థాయిలో సచివాలయ వలంటీర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీ నూతన విధివిధానాలని తెలియజేస్తూ కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేయనున్నారన్నారు. ఏదైనా కారణాలతో పేదలు అనారోగ్యానికి గురైత . ఆ కుటుంబానికి కొంత ఆర్థికంగా కూడా ప్రభుత్వం ఆసరాగా కల్పిస్తుండడం గొప్ప విషయం అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఆ రోగి పూర్తిగా కోలుకొనే వరకూ 'వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఆసరా' పథకం ద్వారా రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5వేలు వరకూ ప్రభుత్వమే చెల్లించి ,ఆ రోగిని, కుటుంబాన్ని ఆదుకుకోవడం నిజంగా గొప్పవిషయం అన్నారు. కిడ్నీ డయాలసిస్, తలసేమియా తదితర దీర్ఘకాలిక రోగులకు నెలకు రూ.10 వేల వరకూ పింఛన్ అందిస్తూ. వారి కుటుంబాలకు ఆరోగ్య ఆసరాతో పాటు ఆర్థిక బాసట కూడా కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, సిపిఒ వెంకట్రావు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి విసిలో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి, ప్రజాప్రతినిధులు

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో మూడు రోజులు పర్యటించే అవకాశాలు ఉన్నాయని జిల్లా పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ విసి హాలులో ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై జెసి గణేష్ కుమార్, నగర కమిషనర్, ప్రవీణ్ చంద్, ఎఎస్‌పి తుషార్ డూడీ, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23, 24, 25 తేదీలలో జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా బద్వేలు నియోజకవర్గం గోపవరం, కడప నగరం, ఇడుపులపాయ, సింహాద్రిపురం, పులివెందులలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, సిపిఒ వెంకట్రావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీలు హక్కులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - కడప

మైనార్టీలు తమ హక్కులను కాపాడుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం కడప నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దేశంలోని మైనారిటీ వర్గాల హక్కులను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరమూ డిసెంబర్ 18న మైనారిటీ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటారన్నారు. ప్రస్తుత మైనారిటీల శాతం దేశంలోని మొత్తం జనాభాలో 19.3 శాతం ఉందన్నారు. స్వేచ్ఛ సమాన అవకాశాలను మైనారిటీలకు అందించాలని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఈ సందర్భంగా జడ్జి వివరించారు. కార్యక్రమంలో శాంత, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, పి.మనోహర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, హెడ్మాస్టర్, కె.పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

మండలంలోని దమ్మనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సుంకేసులపల్లెలో రాజ్యసభ ఎంపీ సి.ఎం రమేష్ నిధుల నుంచి రూ.10 లక్షలతో నిర్మించబోయే సిసిరోడ్డు నిర్మాణానికి సోమవారం టిడిపి మండల అధ్యక్షులు భైవరప్రసాద్ భూమి పూజ చేశారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుంకేసులపల్లె గ్రామంలో రోడ్లు అధ్వానంగా మారాయని, నిధులు మంజూరు చేయాలని ఎంపీని కోరగా వెంటనే స్పందించి మంజూరు చేశారని చెప్పారు కార్యక్రమంలో టిడిపి నాయకులు సీత వెంకటసుబ్బయ్య, తోట బ్రహ్మయ్య, సీతా బాలాజీ, యాసం శ్రీనివాస్, తోట జనార్ధన్, కరిముల్లా, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచాలి

ప్రజాశక్తి- చెన్నూరు

కౌశల్ పరీక్షలో రాష్ట్ర స్థాయికి చేరిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని ఎంఆర్‌సి భవనంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిపి మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీల్లో జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కౌశల్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కస్తూర్బా విద్యార్థినులు ఇంత ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందన్నారు. ఎంఇఒ గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీలు ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎంఇఒ-2 సునీత, హెచ్ఎం రత్నాదేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-అట్లూరు

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎఇ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈనెల 20న ఉదయం 11.30 గంటలకు మైదుకూరు విద్యుత్ కార్యాలయంలో నిర్వహిస్తారన్నారు. మైదుకూరు డివిజన్ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, వనిపెంట, చాపాడు, ఖాజీపే, బద్వేల్, గోపవరం, బ్రహ్మంగారిమఠం, పోరుమామిళ్ల, కలసపాడు, బి. కోడూరు, కాశినాయనకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

-యూనియన్ గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగ, కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం విద్యుత్ భవన్ ఎదురుగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులు సిఐటియు అనుబంధ సంఘాలైన రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను ముఖ్యమంత్రి హామీ మేరకు వెంటనే రెగులైజ్ చేయాలని, పనికి తగ్గ వేతనం చెల్లించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర నాయకులు సి. హెచ్. చంద్రశేఖర్ మాట్లాడుతూ యాజమాన్యం విద్యుత్ కార్మికుల పట్ల, ఉద్యోగుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తుందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. డిస్కం ప్రెసిడెంట్ ఎం. శివశంకర్ మాట్లాడుతూ యూనియన్లు చేసుకున్న ఒప్పందం మేరకు విద్యుత్ ఉద్యోగులకు వేతన బకాయిలు, కరువు బత్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగసుబ్బయ్య శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో కొన్ని డివిజన్లలో ఇపిఎఫ్ సక్రమంగా అమలు కావడం లేదని వాపోయారు. కాంట్రాక్ట్ కార్మికుల నాయకులు బాలకృష్ణ సురేంద్ర మాట్లాడుతూ మీటర్ రీడర్ల పీస్ వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం యాజమాన్యం దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు కెన.సురేంద్రబాబు మాట్లాడుతూ ధర్నా కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారం కాకుంటే ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ధర్నా చేస్తున్న ప్రాంతానికి విద్యుత్ ఎస్ఇ వచ్చి తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని, మిగతా వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామి ఇచ్చారు. అనంతరం కార్మికులు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయబ్ రసూల్, జిల్లా నాయకులు నాగమల్లయ్య, రాజంపేట డివిజన్ అధ్యక్షుడు ఎరికల్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ ఎదుట ధర్నాచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులు

బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని మరియాపురంలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హైస్కూల్ విద్యార్థులు వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ ఇంటర్ డిస్ట్రిక్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పోటీలను జిల్లా కిక్ బాక్సింగ్ అసోషియేషన్ తరువున సోమవారం బద్వేల్‌లో నిర్వహించారు. విజేతలకు ఆర్‌డిఒ వెంకటరమణ మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పోటీలలో 5వ తరగతి చదువుతున్న షేక్. ఇబ్రహీం గోల్డ్ మెడల్, 6వ తరగతి చదువుతున్న షేక్. రిమాస్, షేక్. అర్షియా కంచు మెడల్ సాధించినారని పీస్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ తెలిపారు. విద్యార్థులు పతకాలు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ పాఠశాలలో విద్యతో పాటు ఆటలలోనూ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న బద్వేల్ ఆర్‌డిఒ వెంకటరమణ

ఎమ్మెల్సీ సాబ్జీ మృతి తీరని లోటు

పోరుమామిళ్ల : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నయ్య, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ఎపిటిఎఫ్ అధ్యక్షులు సత్తార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఎంఆర్‌సి భవనం వద్ద చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల ధర్నాకు మద్దతు తెలియజేసి తిరిగి వెళ్లే సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం అందరిని కలచివేసిందన్నారు. సాధారణ ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉపాధ్యాయ నేతగా అంచలంచెలుగా ఎదిగి ఉపాధ్యాయ హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రమణమూర్తి, కె. జోజయ్య, భాస్కర్ రెడ్డి, ఈశ్వరరావు, ఎస్‌టియు నాయకులు పుల్లయ్య, బాలరాజు, జయరామిరెడ్డి, ఎపిటిఎఫ్ నాయకులు రాంభూపాల్ రెడ్డి, ఆదిశేషారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు

ఆరు సూత్రాలపై విస్తృత ప్రచారం

- కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు తిరుపాలరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న ఆరు సూత్రాల పథకంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని ఆ పార్టీ పులివెందుల అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యుడు కేరెడ్డి తిరుపాలరెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కూడా అస్త్ర శస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. పులివెందుల అసెంబ్లీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రచారంలో ఆరు సూత్రాల అమలు ప్రచారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి తుపాకుల నూర్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రమేష్, కిసాన్ రైతు సంఘం అధ్యక్షుడు వెంగళరెడ్డి, సింహాద్రిపురం మండల అధ్యక్షులు శివతోపాటు పలువురు నాయకులను కలుపుకొని ప్రచారం సాగించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పుల్లూరు గ్రామ సచివాలయంలో ఫర్నీచర్ ధ్వంసం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పుల్లూరు గ్రామ సచివాలయ కార్యాలయంలో పెద్ద ఎత్తున ఫర్నీచర్ ధ్వంసమైంది. ఈ విషయం ఆలస్యం గా వెలుగులోకి వచ్చింది. కార్యాలయంలో కంప్యూటర్లు, కుర్చీలు, కేబుల్ వైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కార్యాలయం గదిలోకి కోతులు ప్రవేశించి ధ్వంసం చేసినట్లు అధికారులు పేర్కొంటున్నా.. మందు బాబుల ఆగడాలతోనే ఈ ఘటన చోటుచేసుకుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా సచివాలయం కార్యాలయం సిబ్బంది నిర్లక్ష్యంతోనే నష్టం జరిగిందని అంటున్నారు. కార్యాలయానికి కిటికీలు వేయడం మర్చిపోవడం, ఒక్కోసారి తలుపులు తెరిచే ఉంచడం వంటి సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సచివాలయ కార్యదర్శి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజా ప్రతినిధులు సైతం ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దెబ్బతిన్న కంప్యూటర్

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని అంబాభవాని దేవాలయం వీధికి చెందిన స్వతంత్ర సమరయోధుడు బాల వెంకటసుబ్బరాయుడు సతీమణి జానకమ్మ (103) సోమవారం ఉదయం మృతి చెందారు. అనారోగ్యంతో కొన్నిరోజులుగా ఆమె ఇంట్లోనే చికిత్స పొందుతూ సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు ఆమె కుమారుడు మధుసూదన్ రావు తెలిపారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. జానకమ్మ స్వగ్రామం పెద్దముడియం మండలం పెద్ద పసుపుల గ్రామం. మంగళవారం పెన్నానది తీరంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

జానకమ్మ (ఫైల్‌ఫోటో)

ప్రతి ఒక్కరికీ నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

పోటీ ప్రపంచంలో ప్రతి ఉద్యోగికి నైపుణ్యత చాలా అవసరం అని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి జి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం కడప నగరం స్మిత్ రోడ్‌లోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న సచివాలయ సిబ్బందికి 'డిజిటల్ అండ్ సోషల్ మీడియా అవేర్నెస్ ట్రైనింగ్ ప్రోగ్రాం'పై నాలుగు రోజుల జిల్లా సాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి జి. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయ ఉద్యోగికి ఏడాది లేదా ఆరు నెలలకు ఒక సారి పునఃశ్చరణ శిక్షణ నిర్వహిస్తున్నామని చెప్పారు. దీని వల్ల మనం చేసే ప్రతి పని నైపుణ్యంతోనూ, వేగవంతంగానూ చేయడానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రతి ఉద్యోగీ తన నైపుణ్యతను పెంచుకోవడానికి శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. తమ జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు అన్నిటిని ప్రజలకు ప్రజలకు వేగవంతముగా చేరవేయాలని తెలియజేశారు. అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సి. రామకృష్ణయ్య మాట్లాడుతూ శిక్షణ శ్రద్ధగా విని తద్వారా అన్ని రకాల నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, రీజనల్ కో-ఆర్డినేటర్ ఎన్.సుబ్బారామిరెడ్డి పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న వెంకటసుబ్బయ్య

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వలస కూలీ మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని విద్యుత్ ఉప కేంద్రం వద్ద సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొని బోయ శీను (30) మృతి చెందాడు. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా ఆత్మకూరు మండలం మూలమాల గ్రామానికి చెందిన బోయ శీను మంగపట్నం వద్ద జరుగుతున్న తాడిపత్రి-కడప నాలుగు లైన్ల జాతీయ రహదారి విస్తరణలో పని చేస్తున్నాడు. స్వగ్రామానికి వెళ్లేందుకు మంగపట్నం గ్రామం నుండి ముద్దనూరు రైల్వే స్టేషన్‌కు నడుచుకుంటూ వచ్చాడు. దారి తెలియక ముద్దనూరు దాటి వెళ్లాడు. వెనక్కి తిరిగి వస్తుండగా విద్యుత్ ఉప కేంద్రం వద్దకు రాగానే గుర్తు తెలి యని వాహనం ఢీకొంది. ప్రమాదంలో శీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతు నికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతి చెందిన బోయ శీను

రైతుకు 'కోత' మిగిల్చిన యంత్రాలు

ప్రజాశక్తి - చాపాడు

వరి పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. బురదలో వరి కోత యంత్రాల ద్వారా నూర్పిడి చేయించడం వల్ల పొలంతో గుంతలు పడ్డాయి. రైతులకు ఇబ్బందికరంగా మారింది. వీటిని చదును చేసుకునేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ప్రత్యేకంగా ట్రిల్లర్, దుక్కిళ్లు చేయించాల్సిన పరిస్థితి. ఖరీఫ్ సీజన్ వరి నూర్పిడి అనంతరం సాధారణంగా నూగు, దోస, మినుము, పెసర పంటలను రైతులు సాగు చేసేవారు. ప్రస్తుతం వరి కోత యంత్రాల ద్వారా ఏర్పడిన గుంతలతో సాధారణ దుక్కిళ్లతోపాటు పంటల సాగు సాధ్యపడదు. పంట పొలాలకు అధికంగా నీరు పెట్టి ట్రిల్లర్, గేజీవీల్స్‌తో దుక్కులు చేయాల్సి ఉంది. సాధారణ ఆరుతడి పంటలు సాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడితే ఈ గుంతలు ఇబ్బందికరంగా తయారవుతాయి. పంట పొలాల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. వీటిని తొలగించుకునేందుకు రైతులకు ఆర్థికభారం తప్పడంలేదు. రెండుమూడు సార్లు దుక్కిళ్లు చేస్తే తప్ప వరి కోత యంత్రాల ద్వారా ఏర్పడిన గుంతలు తొలగించుకునే పరిస్థితి లేదు.

'విద్యార్థుల్లో పెద్దలపట్ల గౌరవం పెంచేందుకే..'

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

విద్యార్థుల్లో పెద్దల పట్ల గౌరవం పెంచేందుకే తానా అమ్మనాన్న, గురువు, పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించామని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు శివరాం పేర్కొన్నారు. మండల పరిధిలోని పోట్లదుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం తానా అమ్మనాన్న, గురువు. పద్యార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా, 100 దేశాల్లో ఉన్న వందకుపైగా తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వమాతరమ్ పేరుతో చిగురుమళ్లశ్రీనివాస్ 100 దేశాల్లో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా శతక పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు, తానా పూర్వ అధ్యక్షులు జయశేఖర్ తాళ్లూరి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగా పోట్లదుర్తి విద్యార్థులు చిగురుమళ్లశ్రీనివాస్ రచించిన అమ్మ శతకం, నాన్న శతకం, గురువు శతకాలలోని పద్యాలను కంఠస్థం చేసి 60 మంది విద్యార్థులు సామూహిక గానం చేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త అమృతవల్లి, మల్లు రఘునాథరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహికంగా పద్యాలు వల్లిస్తున్న విద్యార్థులు, తానా సభ్యులు, ఉపాధ్యాయులు

లఘు చిత్రం షూటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఫిలిం హలిక్స్ స్టూడియోస్ హిమశ్రీ ప్రొడక్షన్ వారు సమర్పించు సందిగ్ధ షార్ట్ ఫిలింను 'మా ఊరి సినిమా' ప్రొడ్యూసర్ మంజునాథరెడ్డి సోమవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ప్రొడ్యూసర్ హరి, డైరెక్టర్ మునివర్ధన్ ఆధ్వర్యంలో ఈ లఘు చిత్రం నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా రంగనాథస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పఠాన్, జయరామిరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మురళీ, 99 యూట్యూబ్ నాని, డిఒపి చాను, హరిత, అను నటిస్తున్నట్లు ప్రొడ్యూసర్ హరి, డైరెక్టర్ మునివర్ధన్ తెలిపారు. వారం రోజుల్లోపు ఈ చిత్రాన్ని పూర్తి చేస్తామని వారన్నారు.

క్లాప్ కొడుతున్న నిర్మాత మంజునాథరెడ్డి

వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రతి ఒక్కరూ సమన్వయంతో విజయవంతం చేయాలని ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా వైజ్ఞానికి ప్రదర్శన నిర్వహణ నిమిత్తం సన్నాహక సమావేశాన్ని సోమవారం స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని కమిటీలు స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి బి.మహేశ్వరరెడ్డి ఆహ్వాన కమిటీ మొదలు ముగింపు సమావేశం నిర్వహణ కమిటీ వరకు వారివారి బాధ్యత, విధి విధానాలను కూలంకశంగా వివరించారు. ముఖ్యంగా కమిటీ ఆద్యంతం చైతన్యంగా ఉంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో చాపాడు ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ, కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు

ఆరోగ్యశ్రీకి అనారోగ్యం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి పాలనలో ఆరోగ్యశ్రీ పథకానికి అనారోగ్యం చేసిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కాంగ్రెస్ మానస పథకమన్నారు. పేదలకు కూడా ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న ఉద్దేశంతో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఎంతో సమర్థవంతంగా అమలు చేయడంతో లక్షలాది మంది రోగులు పునర్జన్మ పొందారన్నారు. జగన్ పాలనలో నెట్‌వర్క్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ రోగులను చేర్చుకోవడం లేదన్నారు. 6నెలలుగా పెండింగ్ బిల్లులు చెల్లించలేదని తెలిపారు. రూ.1000 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2013లో ప్యాకేజీ ధరలు నిర్ణయించి తర్వాత పెంచలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి, ప్యాకేజి ధరలు కూడా పెంచాలని నెట్‌వర్క్ ఆస్పత్రులు డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. సమస్యలు పరిష్కరించకుండా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.25 లక్షలకు పెంచి ప్రయోజనమేమిటిని తులసిరెడ్డి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహించే పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె 50 పడకల ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందన్నారు. సబ్ సెంటర్ల గురించి పట్టించుకునేవారు లేరని తెలిపారు. 108 వాహనాలు కనిపించడం లేదన్నారు. మూడవసారి తానే ప్రధానిని అవుతానని మోడీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాబోవు ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి రావడం, రాహుల్ ప్రధాని కావడం తథ్యమన్నారు.

ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి-కలసపాడు

ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి. రమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎగురామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ప్రణాళిక బద్ధంగా చదివి గలిగితే విజయం తప్పకుండా సాధిస్తారని చెప్పారు. ఉన్నత చదువులకు 10వ తరగతి కీలక మెట్టు అన్నారు. తాము చదువుతున్న రోజుల్లో సరైన అవగాహన లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వారమని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని చెప్పారు. సమాజసేవలో ముందుండే వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి విద్యార్థుల భవిష్యత్తు కోసం స్వయంగా కెరీర్ గైడెన్స్ పుస్తకాన్ని రూపొందించి, జిల్లా అంతటా ప్రభుత్వ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. సంస్థలో తాను ఒక గౌరవ సలహాదారులుగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం తన అదృష్టం అన్నారు. సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తమ సంస్థ ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలియజేశారు. అనంతరం పదో తరగతి చదువుతున్న 66 మంది విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.కమాల్, ఉపాధ్యాయులు సత్యం, శ్రీనివాసులు, బ్రహ్మారెడ్డి,గురయ్య,తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభకు తరలిరండి : టిడిపి

ప్రజాశక్తి కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని టిడిపి కడప నియోజకవర్గం మాజీ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు మన్మోహన్‌రెడ్డి, జనసేన జిల్లా ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాస్, కార్పొరేటర్ ఉమాదేవి మాట్లాడుతూ ముగింపు కార్యక్రమానికి తండోపతండాలుగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చీకటి పాలన సాగుతుందని విమర్శించారు. మంత్రులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు పదవులు, అధికారాలు లేవన్నారు. ఇలాంటి వ్యక్తిని భరించే స్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. మోడీ, కెసిఆర్ మద్దతు, ప్రతిపక్ష పార్టీల ఓట్లు చీలడంతో జగన్మోహన్ రెడ్డికి 151 సీట్లు వచ్చాయన్నారు. ఈసారి ఓట్లను చీలకుండా చూస్తామని చెప్పారు. తుపాన్ బాధితులను ఆదుకోవడంలో సిఎంవిఫలమయ్యారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతి నిధి ఆమూరి బాలదాసు, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, జయరామిరెడ్డి, నవీ కోట శీను, నజీర్ అహ్మద్, మామిళ్ళ శివ, స్వర్ణకుమారి, చిప్పగిరి మీనాక్షి, నిర్మల, చంద్రకళ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఉమాదేవి

రక్తదానం చేయడానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి - కడప

ఆరోగ్యవంతమైన యువత ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆంధ్ర ప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఎపిఎన్ఆర్‌టిఎస్) డైరెక్టర్ బి.హెచ్. ఇలియాస్ అన్నారు. సోమవారం రక్తదాన ప్రచారకుడు, ఐఆర్‌సి సీనియర్ సభ్యులు అబ్దుల్ రాయల్ కరీముల్లా ఆల్మాస్ పేట సర్కిల్ బళ్లారి రోడ్‌లో ఇలియాస్ చేతుల మీదగా రక్తదాన కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న సిఎం వైఎస్ జగన్ పుట్టినరోజు, 25న క్రిస్మస్ పండగ ఉన్నందున యువత, ఆరోగ్యవంతులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. కడప జిల్లా పేరు రక్తదాతల జిల్లాగా పేరు తేవడానికి కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు బాబు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీహెచ్ ఇలియాస్

ఆన్‌లైన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి, అధికారులు

వైద్యానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, ఇందులో భాగంగా డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే పథకానికి శ్రీకారం చుట్టిందని ఎంపిపి టి.లక్ష్మమయ్య తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించిన సేవలను తిలకించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, వెలుగు ఎపిఎం వెంకటరమణ, మండల వైద్యాధికారులు శ్రీవాణి, ఓబులేష్, కావ్యమాధురి, సిహెచ్ఒ మహదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, సూపర్వైజర్ సరస్వతి, పిహెచ్ఎన్ సుకన్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు జి.డేవిడ్‌రాజ్

డిగ్రీ విద్యార్థులను వేధించొద్దు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

డిగ్రీ విద్యార్థులను ఫీజుల పేరుతో వేధించకుండా హాల్ టికెట్స్ ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ కోరారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20నుంచి జిల్లాలో యోగి వేమన యూనివర్సిటీ పరదిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టలేదని వేధించకుండా హాల్ టికెట్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాము, సురేష్, బాబు పాల్గొన్నారు.

కార్యకర్తలతో భూపేష్‌రెడ్డి సమావేశం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మున్సిపాలిటీ, మండలంలోని కార్యకర్తలతో జమ్మలమడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని రానున్న రోజుల్లో ప్రతి ఇంటికి చేరేలా దిశానిర్దేశం చేశారు. బాండ్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం కూడా క్లస్టర్లు యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు ప్రతి ఇంటి దగ్గరికి వెళ్లి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కేక్ కట్ చేస్తున్న పాస్టర్ పి.మహేష్

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కడప

కడప నగరం తెలుగు గంగా కాలనీలో ఉన్న హోలీజియోన్ చర్చిలో సోమవారం పాస్టర్ పి.బెంజమిన్, సిస్టర్ దీన రాణి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులుగా న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ దైవజనులు పాస్టర్ పి.మహేష్, హైదరాబాద్ కు చెందిన పాస్టర్ అర్.పి దాస్ హాజరయ్యారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి భక్తులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో పాస్టర్లు జె.ఇజ్రాయిల్, యస్.జాకబ్, యస్.మోషే, డి.అమర్ పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, నాయకులు

బాధిత కుటుంబానికి బీమా మంజూరు

ప్రజాశక్తి - చెన్నూరు

అరుంధతి నగర్‌కు చెందిన చెప్పలి నాగార్జున ఈనెల 15న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి వైఎస్‌బీమా బీమా ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం ఎంపిపి సురేష్‌యాదవ్, సర్పంచ్ వెంకటసుబ్బయ్య అందజేశారు. మిగిలిన రూ.90 వేలను వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా పేదలకు వరం లాంటిదని అన్నారు కార్యక్రమంలో వైసిపి నాయకులు సురతాని శ్రీనివాసులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE MOBILE COURT, KADAPA

D.V.C. 65/2023

1. K.Mary Flarance, W/o P.Ravi Kumar, D.No.101-A, Silpasadam, Kadapa.
2. P.Lizy, D/o P.Ravi Kumar has Rep.her mother as gardiam. Both are R/at-101, Silpasadan, Opp.S.P.Banglaw, Kadapa City, Kadapa Dt.

...Petitioner

Vs

P.Ravi Kumar, S/o Yesaiah, D.No.2/3, Yerraguntla Town, Kadapa Dist.

...Respondent

NOTICE

పై కేసులో వాది ప్రతివాదిపై గృహహింస కేసు పై కోర్టులో దాఖలుచేసియున్నందున, పై ప్రతివాది తప్పకుండా 20.12.2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో ప్రతివాది కాని, ఆయన తరపు వకీలు గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినదిగా తెలుపడమైనది. లేనియెడల అతని పరోక్షములో కేసు తీర్మానించబడును.

//By Order of the Court//

B.GURAPPA NAIDU
Advocate,
Kadapa.